# మతపరమైన సామాజిక శతృత్వ భావమున్న దేశాల్లో మన దేశానిదే అగ్రస్థానం

**ప్యూ** పరిశోధనాకేంద్రం, ఇండియావారు 2007 నుండి తమ 13వ ఎడిషన్ సర్వేను 2020 వరకూ నిర్వహించారు. వారు 198 దేశాల్లో యిటువంటి సర్వేను నిర్వహించి, ఆయా దేశాలలోని, సమాజాల్లోని ప్రజల మధ్య మతపరమైన శతృత్వ భావం (యితర మతస్థుల పట్ల శతృత్వభావం) ఏ మేరకు వుందోనన్న విషయాన్ని అంచనా వేశారు. 2007 సంవత్సరంలో ఆయా దేశాలలో వున్న ప్రజల్లో గల శతృత్వ భావం ప్రాతిపదికగా, 2019 మరియు 2020 సంవత్సరాల నాటికి ఆ మత శతృత్వభావం ఏ స్థాయికి పెరిగింది లేదా ఏ స్థాయికి తగ్గింది అని అంచనా వేశారు. వారు సర్వే చేసిన 198 దేశాలలోనూ, సమాజంలో మతపరమైన శతృత్వం అత్యధికంగా వున్న దేశంగా మన దేశం వెల్లడయింది. 2007 నాటి మతసంబంధమైన విషయంలో సమాజంలో గల శతృత్వభావం 2019 నాటికి పెరిగి, 2020 నాటికి మరింతగా అధికమైంది.

13 అంశాల ఆధారంగా చేసిన యీ సర్వేలో మొత్తం పది మార్కులు వుంటే, భారతదేశానికి 2007లో 8.8 మార్కులు వస్తే, 2019 నాటికి అవి 9.1కి పెరగగా 2020 నాటికి 9.4 మార్కులకు పెరిగింది. అంటే క్రమక్రమంగా మన సమాజంలో మతపరమైన శతృత్వభావనలు పెరిగిపోతున్నాయని అర్థం. ఒక సెక్యులర్ (మతప్రసక్తి లేని రాజ్యం) రాజ్యంగా వుండవలసిన భారతదేశంలో మతసంబంధ సామాజిక శతృత్వ భావనలు క్రమంగా పెరిగిపోతూ వుండటమన్నది, మనదేశం ఎటువైపు పోతోందో తెలుపుతుంది. ఇందుకు కారణం దేశంలో ప్రభుత్వాధికారంలో వున్న బి.జె.పి, దాని సైద్ధాంతిక మార్గదర్శక సంస్థలైన ఆర్.ఎస్.ఎస్., భజరంగదళ్ లాంటి హిందూ మతతత్వవాద సంస్థలేనన్నది నిర్వివాదమైన అంశం. ఈ సంస్థలు, వీటి అనుబంధ సంస్థలు ఏవిధంగా హిందూ మతతత్వ విద్వేషాలను దేశమంతటా అనునిత్యం రెచ్చగొడుతున్నాయో, మత విద్వేష అల్లర్లకు పాల్పడుతున్నాయో, ఎటువంటి అదుపూ లేని ఘోర కృత్యాలు సాగిస్తున్నాయో, మత సఖ్యతతో జీవిస్తున్న వివిధ మతాల ప్రజల మధ్య మత విద్వేష భావాలను రెచ్చగొట్టి, ఐక్యం కాకుండా ఎంతగా విభజిస్తున్నాయో, యీ హిందూత్వవాద సంస్థల ప్రతీచర్యనూ ప్రభుత్వాధికారంలో వున్న బి.జె.పి. పాలకులు సమర్ధించటమేకాక, హిందుత్వవాద అభివృద్ధి నిరోధక భావాలకు అనుగుణమైన చట్టాలను ఏవిధంగా తయారుచేస్తున్నాయో మనం నిత్యం గమనిస్తూనే వున్నాం. ఇటువంటి మత విద్వేష భావాలను ప్రజల్లో రెచ్చగొట్టడం ద్వారా మెజార్టీ హిందువుల ఓట్లను పొందుతూ ప్రభుత్వాధికారానికి చేరుకొంటున్న వైనాన్నీ చూస్తూనే వున్నాం. వీటిని నిరోధించి ప్రజల మధ్య మైత్రి, సయోధ్యలను పెంపుదల చేయవలసిన న్యాయవ్యవస్థ, తదితర పరిపాలనా వ్యవస్థలు ఏవిధంగా విఫలమవుతున్నాయో కూడా మనం చూస్తూనే వున్నాం. ప్రధానంగా ముస్లిం మతస్థులపై ఎక్కుపెట్టబడిన యీ అమానవీయ హిందూమతతత్వవాదుల హేయమైన దాడులను, అత్యాచారాలను గమనిస్తూనే వున్నాం.

ఇటువంటి మతవిద్వేష, శతృత్వ హిందూత్వ విధానాలను సమర్ధిస్తూ, ప్రోత్సహిస్తూ బిజెపి పాలకులు రాజ్యాధికారాన్ని కైవసం చేసుకోవటమే కాకుండా, దేశ ప్రజలు తామనుభవిస్తున్న దుర్భర జీవన పరిస్థితులకు గల మూలకారణాలను గురించి ఆలోచించకుండా, వారి ఆలోచనలను అనవసరమైన పరమత వ్యతిరేక భావాలవైపు మళ్ళిస్తూ, తమ పబ్బం గడుపుకుంటున్నారు.

ఈ ప్రమాదాన్ని సూచించేదే యీ "మత సంబంధ విషయాల పట్ల, సామాజిక శతృత్వ భావనల"కు సంబంధించిన సూచిక.

ఈ సర్వే ద్వారా, తయారుచేయబడ్డ సూచికను గమనిస్తే మరో గమనార్హమైన అంశం మన ముందుకొస్తుంది.

ముస్లిం మత దేశంగా వుండి, మన శతృదేశంగా నిరంతరం పాలకులచేత ప్రచారం చేయబడుతున్న పాకిస్తాన్ దేశంలో 2017లో మతశతృత్వ భావాల స్థాయి 8.9 స్థాయిలో వుంటే అది 2019 నాటికి 8.1 తగ్గి, 2020 నాటికి 7.5కు తగ్గిపోయింది.

అదేవిధంగా మరో ఇస్లాం మత దేశమైన ఇరాన్‌లో 2007లో మతపర శతృత్వ భావనలు 6 స్థాయిలో వుంటే, 2019 నాటికి అవి 1.5 స్థాయికి, 2020లో 1.9 స్థాయి మేరకే వున్నాయి. పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో కూడా 2007లో 8.3 స్థాయిలో వున్న మతపర శతృభావనలు 2020 నాటికి 7 స్థాయికి తగ్గిపోయాయి.

మనదేశంలో మాత్రం సామాజిక మతపర శతృభావనలు నానాటికీ పెరిగిపోతున్నాయి.

సోషల్‌మీడియాలో అబద్ధపు వార్తల ద్వారా, మతపర విద్వేషం రెచ్చగొట్టడం ద్వారా, మూఢమత విద్వేషపు దాడుల ద్వారా హిందుత్వవాద శక్తులు యీ రకంగా దేశంలోని ప్రజల

మధ్య మత సామరస్యాన్ని విధ్వంసం చేస్తున్నాయి. ఇది ప్రజాస్వామిక అవగాహనా, ఆకాంక్షలకు ప్రమాదకరమైన ధోరణి. గొడ్డలిపెట్టు.

ఇప్పటికైనా యీ ప్రమాదాన్ని గుర్తించి, వివిధ మతాల దేశ ప్రజల మధ్య మతసామరస్యాన్ని, ఐక్యతను పెంపొందించాల్సి వుంది. ఇది సమాజ పురోగామి శక్తుల వలననే సాధ్యమయ్యే పని. మితవాద, అభివృద్ధి నిరోధక, వినాశక శక్తులైన యీ హిందూ మతతత్వవాద శక్తుల నుండి ముంచుకొచ్చిన యీ ప్రమాదాన్ని దేశంలోని పురోగామి శక్తులన్నీ ఐక్యంగా ప్రతిఘటించటం నేటి తక్షణావసరం.

* * * * *